# బ్రతుకు బొట్టెలు

## కుమారి ఉన్నవ విజయలక్ష్మి

బందరు బస్సుస్టాండు జనంతో సందడిగా ఉంది.

బెజవాడకెళ్లేవి, గుడివాడకెళ్లేవి, ఏలూరుకెళ్లేవి ఇంకా అటు నాగాయలంకకెళ్లేవి, మరి అటునుండి వచ్చేవి స్టాండులో నిత్య ప్రయాణం! స్టాండుకు ముందుగా, సోడాషాపు పక్కనే కూర్చున్నారు ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు ఏవిటేవిటో అమ్ముకుంటూ. దారినిపోయే జనాన్ని ఒక నిమిషం ఆపివేస్తోంది నడుమగా కూర్చున్న బంగారు. వేసవిలో కొల్లలుగా వచ్చిన మల్లెలు ముందేసుకుని దండలు కడుతూ కూర్చుంది. ముప్పై ఏళ్లుంటాయి. పేరుకు తగ్గ ఛాయ. పరిపుష్టమై బిగువుగా బుసలు కొట్టే శరీరం. ముఖాన ఫాలభాగాన్ని నిలువుగా విభజిస్తూ పైకి ఎగబాకిపోయిన పచ్చబొట్టు, భారమైన కేశసంపద పెట్టని సొమ్ములు బంగారుకు. పూలు కడుతూ వచ్చేపోయేవారిని యథాలాపంగా పరికిస్తున్న బంగారు తనకెదురుగా వస్తున్న తల్లీబిడ్డలను జూచి ఒక క్షణం ప్రూన్పడిపోయింది. తల్లి చెయ్యి పట్టకుని నడుస్తున్న నాలుగేళ్ల పిల్లవాణ్ణి పరీక్షగా చూసింది. ఆ మనిషి తన దగ్గరకు రాగానే ఉత్సుకత అణచుకోలేక "ఏ వూరమ్మా మీది?" అని పలుకరించింది.

"మేమా, ఏలూరు పోవాలి, ఇంకెట్లా పోవటం?" అని నిట్టూర్చింది.

"ఏం, ఎందుకని? ఇంకో అరగంటకు బయలుదేరుతుందే ఏలూరుకెళ్లే బస్సు!"అంది బంగారు.

"చిల్లర కొంగున ముడివేసుకున్నాను. ఎక్కడ జారిపోయిందీ తెలియదు. చేతిలో కానీ లేదు. ఎట్లా పోవటం? పిల్లలకేమన్నా పెట్టిద్దామన్నా లేదు!" అన్నదా మనిషి దాదాపు ఏడుస్తూ. కుర్రవాడు తల్లి కొంగు పట్టి లాగుతూ, "ఆకలేస్తోందే!" అన్నాడు. వాడి అక్క ఎనిమిదేళ్లది పెద్ద ఆరిందాలాగా "డబ్బులు పోయినయ్యంటే ఆకలంటావేరా?" అని అదమాయించింది.

బంగారు ఆ పిల్లవాని ముఖం చూచి కరిగిపోయింది. గబగబా పూలు బుట్టలో సర్దేసి, "మా ఇల్లు దగ్గరే, పదండమ్మా!" అన్నది. ఆ మనిషికర్థం కాలేదు. "ఫరవాలేదు రావమ్మా! నీ పేరేమిటున్నావ్?" అంది బంగారు. "పార్వతి" అన్నదా మనిషి. "ఈ బుట్ట నువ్వు పట్టుకో, వాణ్ణి నేను ఎత్తుకుంటాలే!" అంది బంగారు. ఆ పిల్లవాడు బంగారు వద్దకు రాలేదు ముందు. "వెళ్లు! ఎవరనుకున్నావ్, మీ పిన్నమ్మ కాదూ!" అంది వాడి తల్లి. బంగారు ఎందుకో లోపల వణికిపోయింది. పిల్లవాణ్ణి ఎత్తుకుని, "బుల్లాడా! నీ పేరేంటి?" అంది. వాడు పలకలేదు.

"వాడి పేరు కృష్ణుడు!" అంది వాడక్క. బంగారు నవ్వి, "నీ పేరూ?" అంది. "సీత" అందా పిల్ల.

బంగారు కృష్ణుని దింపి ఇల్లు తాళం తీసింది. అది మట్టి గోడల ఇల్లు. పైన తాటాకు కప్పు. గోడలు తెల్లగా సున్నం కొట్టి ఉన్నాయి. లోపలంతా అలికి పరిశుభ్రంగా ఉంది. బంగారు మూలనున్న చాప తెచ్చి పరిచింది. "పిల్లకు నీళ్లు పోసి నువ్వు కూడా స్నానం చెయ్యి, అప్పా! నే వంట చేస్తాను" అన్నది బంగారు. పార్వతి మరి మాట్లాడలేదు. ఆమె, పిల్లలు స్నానం చేసి భోంచేశారు.

"అయితే ఏంటి కథ, నువ్వీ వూరు ఎందుకు వచ్చినట్టు? ఎందుకు వెళ్తున్నట్టు?" అంది బంగారు.

"మా అన్నయ్య ఉండేవాడీ వూళ్లో. ఏదో వాడి ఆసరాతో ఈ వూళ్లో ఉండిపోదామని వచ్చాను. ఇక్కడే సైంటిఫిక్ కంపెనీలో పనిచేసేవాడు. ఇప్పుడు పోయి అడిగితే, ఎక్కడికెళ్లిందీ ఎవరూ చెప్పలేదు. ఇంకేం చెయ్యను? మళ్లీ చావో బతుకో ఇంటికే పోవాలి!" అంది పార్వతి

"మరయితే మీ మొగమనిషి ...." ఆపేసింది బంగారు. పార్వతి బావురుమని ఏడ్చేసింది.

"వూరుకో, వూరుకో ఏడవమాకు!"

"ఆర్నెల్లనాడు ఉన్నట్టుండి మాయమైపోయాడు. ఏ పాపం ఎరగను నేను. ఒక తెల్లారి లేచి చూస్తే పక్కమీద లేడు. రేపు వస్తాడు, మాపు వస్తాడనుకుంటూ నెల గడిపాను. తర్వాత తిండి ఎట్లా? ఆ అమ్మను ఈ అమ్మను పట్టుకుని ఎవరింట్లోనో వంటకు కుదిరాను. కానీ చూడు, కనిపెట్టుకునే మగదిక్కు లేని ఆడదని తెలిశాక ఎవరికైనా అలుసే! ఏం చెప్పను. భయమేసి పని మానుకుని వూరు విడిచిపెట్టి వచ్చేశాను. ఈ వూళ్లో అన్న ఒకడున్నాడు కదా, ఏదో నా రెక్కల కష్టంమీదనే బతికినా, మాటవరసకు మగదిక్కనుకున్నా! నా ప్రారబ్దం, ఆ దిక్కూ లేదు. రోజులు ఎట్లా గడవాలో అర్థం కావటంలేదు" అంది పార్వతి.

బంగారు బరువుగా నిట్టూర్చింది. కృష్ణుడి ముఖంకేసి పరీక్షగా చూస్తూ "ఏం పని చేసేవోడు?" అంది.

"పనా, ఏం పనో నాకేం తెలియదు. సాయంత్రానికి రెండు రూపాయలకు తక్కువిచ్చేవాడు కాదు. వూళ్లో అందరూ 'రౌడి రంగప్ప' అనేవారు."

పాము కాటు తిన్నట్లుంది బంగారుకు.

"ఏంటీ అట్లా వులిక్కిపడ్డావు?" అంది పార్వతి.

"ఆ మధ్య ఈ వూళ్లో ఆ పేరెక్కడో విన్నట్టుంది."

"ఆఁ... ఆ జాడ నీకేమైనా తెలుసా?"

"తొందరపడమాకు, కనుక్కుందాంలే! మా ఇంటాయనికి చెప్పి వెదికిస్తాను!" అంది బంగారు. కృష్ణుణ్ణి నెమ్మదిగా ఒళ్లోకి తీసుకుని, అవ్యక్త భావపరంపరలో ఊగిపోతూ వాడి బుగ్గలు నిమరసాగింది బంగారు.

"మీ ఆయనకేంటి పని?"

బంగారు వినిపించుకోలేదు. కొన్ని క్షణాలకు తేరుకుని 'ఆ పళ్ల దుకాణం ఉంది' అన్నది.

"నువ్వు మల్లెపూలమ్మితే, ఆయన మామిడి పళ్లమ్ముతాడన్నమాట. మా బాగా ఉంది. అదేంటి, అట్లా అయిపోయావేంటి?" అంది పార్వతి ఆశ్చర్యంగా.

"అబ్బే, ఏం లేదు. అయ్యో నా తెలివి మండినట్టే ఉంది. అన్నం పట్టుకెళ్లద్దూ!" అని కృష్ణుణ్ణి దింపి

లేచింది. తర్వాత నవ్వు తెచ్చుకుని, "వీడు వాళ్ల అయ్య పోలికేమిటి?" అంది.

"వూఁ... మరీను, నోట్లోంచి ఊడిపడినట్టే ఉంటాడు!" అంది పార్వతి.

బంగారు అన్నం సగం సర్ది ఏమనుకుందో తటాలున అన్నం తిరిగి కుండలో వేసి మూత పెట్టింది. మేకునున్న బుట్ట చేత్తో తీసుకుంది. 'నా మతి మండిపోయింది ... కూర వండలే దివ్వాళ!" అంది బంగారు. "అంతా మాకే పెట్టేసినావెంటి?" అంది పార్వతి బాధగా.

"ఊహుఁ, కాదు. ఇవాళ ఆ కూర వద్దు, బజారెల్లొస్తా!" అని వెళ్లిపోయింది బంగారు. బంగారును చూస్తున్నకొద్దీ పార్వతి ఆశ్చర్యం పెరిగిపోతోంది. పది నిముషాల్లో తిరిగి వచ్చిన బంగారు ఇంకాసేపటికి గిన్నెలో అన్నం, మాంసం కూర సర్ది మూట కట్టుకుని పళ్ల దుకాణంకేసి నడిచింది.

తనకోసం ఎదుకు చూస్తున్న రంగన్నను చూసి బలవంతాన నిట్టూర్పు అణుచుకుంది బంగారు.

"ఇంత ఆలస్యం చేసినావెంటి?" అన్నాడు రంగన్న.

"ఒకరోజు ఆలస్యమైతే నేం? రేపటినుంచి పెందలకాడే తిందువుగానిలే!" అంది బంగారు.

"ఏంటట్లా వున్నావ్, ఏం టయినదేవిటి?"

"ఏమీ గాలా! నువ్వు అన్నం తిను!"

"వూఁ.... ఇందుకా ఇంత ఆలస్యం. చెప్పావు గాదేం మరి!" అన్నాడు రంగన్న మాంసం కూర రుచి చూస్తూ. భోం చేస్తున్న రంగన్న తలెత్తి బంగారు ముఖంకేసి చూశాడు. బంగారు మాటా మంతీ లేకుండా కూర్చొటాన రంగన్న విస్తుపోయాడు.

"ఏం పుట్టి మునిగిందే, మూతి అంత మూరెడు చేసుకున్నవ్?" అన్నాడు రంగన్న నవ్వుతూ.

"మునిగితే నా పుట్టే మునుగుతుంది, నీదేం పోతుంది?"

"ఛత్! నే నన్నం తినను, పో! గిన్నె తీసుకెళ్లు!"

"నీ కాళ్లు పట్టుకుంటా, ఇవాళ నా పని బాగాలేదు. నేనేమన్నా ఊరుకో ఈ ఒక్కరోజుకు!" అంది బంగారు బొంగురుపోయిన గొంతుతో.

రంగన్న మాట్లాడలేదు. కాసేపటికి "అదేంటి అన్నమంతా అలా కెలికేస్తున్నావు, ఒక్క మెతుకిడిచిపెడితే నా మీద ఒట్టు!" అంది ఆదుర్దాగా. రంగన్న మరి మాట్లాడలేదు. చివరకు "ఈ రెండు ముద్దలు నీకు!" అన్నాడు. బంగారుకు

**అలనాటి ప్రముఖ రచయిత్రి, ఉన్నవ విజయలక్ష్మిగారు రచించిన ఈ కథ, 1957 జులై, మూడు సంచికలో ప్రచురితమయ్యింది.**

ఏడ్పు ఆగలేదు. బలవంతంగా మాట పెగల్చుకుని, "ఏదీ నా చేతిలో నువ్వే పెట్టు!" అంది. రంగన్న నవ్వు తెచ్చుకుని, "చేతిలోనా, నోట్లోనా" అన్నాడు. బంగారు చెయ్యి వెనక్కి తీసుకుని నోరు తెరిచింది. బంగారు వాలకం రంగన్నకేమీ అర్థం కాలేదు. "ఎందుకేడుస్తావ్ బంగారూ, చెప్పవ్. ఒంట్లో బాగాలేదా? ఏదైనా గుర్తుకొచ్చిందేంటి? ఉండు దుకాణం మూసి నే కూడా వస్తా!" అన్నాడు.

బంగారు కంగారుగా "వద్దు! నయ్యం, నాకేమైంది కనుక? సాయంత్రం పెందలాడే రా! నే వెళ్తా!" అని రంగన్న జవాబుకోసం ఎదురు చూడకుండానే ఇంటిదారి పట్టింది.

పార్వతి బంగారుకోసం ఎదురు చూస్తోంది. కొత్త మనిషిమీద ఇల్లు విడిచి వెళ్లిన బంగారు సాహసానికి రిచ్చపోయింది. బంగారు వచ్చి, "ఏం అప్పా! కాసేపు పడుకోకపోయావ్, పిల్లలు నిద్రోయారే!" అంది.

"ముందు నువ్వు భోంచెయ్!"

అంది పార్వతి.

"నే నక్కడే భోంచేసి వచ్చా!" అంది బంగారు.

"రోజూ అక్కడే భోం చేస్తావేవిటి?! అంది పార్వతి.


బంగారు నవ్వింది. బంగారు 'సౌభాగ్యానికి' మురిసిపోయింది పార్వతి. కాస్సేపట్లో పార్వతికి నిద్రపట్టిపోయింది. వేసవికాలపు మధ్యాహ్నాలు, కళ్లు మూస్తే కునుకు చేరుతుంది. బంగారుకు కన్నుమూత పడలేదు. గడచిన జీవితం గుర్తుకు రాక ఆగలేదు.

బంగారు బందరు చేరి ఎనిమిది నెలలే అయింది. ఇద్దరి ముగ్గరి ఇళ్లలో పాచిపని చేసేది. ఆ రోజుల్లోనే రౌడీగా చలామణి అవుతున్న రంగన్న ఒకరోజు బంగారుతో ఏమో అన్నాడు. బంగారు "పిచ్చిగా మాట్లాడకు, పళ్లు రాలగొడ్తాను!" అంది కానీ, బంగారుకా విధంగా ఎన్నో రోజులు గడవలేదు. ఉన్నట్టుండి ఒకరోజు తనే పని పెట్టుకుని రంగన్న దగ్గరకు వెళ్లింది.

"ఆరోజు రమ్మన్నావు, వచ్చాను!" అంది రంగన్న కళ్లలోకి నిర్వికారంగా చూస్తు. రంగన్న నవ్వుతూ ఇంటి తాళం తీశాడు. రంగన్న నవ్వు జూచి బంగారు మొఖం ఎర్రబడిపోయింది. అసహాయంగా ఆమె పెదవులు వణికాయి. రంగన్న సాహసం కొంత తగ్గింది.

"ఏమయింది? ఎందుకొచ్చావ్?" అన్నాడు.

"ఏం చెయ్యను? రాత్రిళ్లు నిద్రపోనీరు. గుడిసెమీద రాళ్ల వర్షం. బైట కంచె అంతా పీకేశారు. రోజూ కుండల దగ్గరనుంచి అన్నీ మాయమవుతున్నాయి. నేను బతకలేను" అంది.




## ఇదే బావుందిట!

నిజం! అవునట! ఇంతకూ ఆ బాగున్నదేమిటీ అంటారా? ఇటీవల పెళ్లయిన మరో జంట రోజా గర్ల్ మధుబాల, ఆమె భర్త ఆనంద్ షా. మరిప్పుడు పెళ్లయిపోయింది కదా, మధు నటనకు స్వస్తి చెబుతుందా? ఆ మాటే ఆమెనడిగితే, తాత్కాలికంగా అంతే! ఈ కొత్త రోజుల్లోని ఆనందాన్ని నేను పూర్తిగా ఆస్వాదిస్తున్నాను. మా ఆయన మధ్యాహ్నం భోజనానికీ, సాయంకాలం యింటికొచ్చేసరికీ నేనింట్లోనే వుండాలనుకుటున్నాను. తను కూడా నన్ను తన కళ్ల ముందే వుంచుకోవాలనుకుంటున్నారు. అందువల్ల ఇప్పటికి నాకు కనీసం ఆ సినిమా స్టూడియోల గురించిన ఆలోచన కూడా రావటం లేదు. ఎప్పుడో నాలో ప్రతిభను వెలికితీసే పాత్ర వస్తే అప్పుడాలోచిస్తాను అంటూంది. పాపం, మధు అభిమానులు! ఏమవుతారో ఏమో! ఎంత గొప్ప స్థాయికొచ్చినా స్త్రీ స్త్రీయే అని నిరూపించావు కదా మధూ!

# మధ్యలో ఆగిన హనీమూన్!

ఎవరిదా అవుకుంటున్నారా? సింగరేణి సుందరి కాజోల్, అజయ్ దేవగణ్‌ల గురించేనండీ! సరదాగా తిరుగుతున్న ఈ హనీమూన్ జంట చూసిన స్థలాలు సిడ్నీ, మెల్బోర్న్, సాన్ ఫ్రాన్సిస్కో, లాస్ ఏంజలెస్, ఆస్ట్రియా వగైరాలు. ఇంతలో యుగోస్లావియాలో బాంబుల వ్యవహారం మొదలవటంతో హనీమూన్‌ను మధ్యలోనే ఆపేసుకుని ఈ ప్రేమ జంట వెనక్కొచ్చేశారు. ప్రస్తుతం కాజోల్ తన యింట్లోంచి తన భర్త అజయ్ యింట్లోకి మారిపోయే హడావిడిలో వుంది. తనకున్న వేలాది పుస్తకానేలా మార్చాలో తెలీక సతమతమవుతుంది కాజోల్. కాజోల్ మామగారు వీరూ దేవగణ్ మాత్రం  మా తరువాయి చిత్రంలో మా అబ్బాయి అజయ్ దేవగణ్ హీరో. హీరోయిన్ ఎవరని మాత్రం ఇప్పుడే చెప్పలేను. ఆమెలో నాకు ఓ నటి కాక, ఆమె మాఅమ్మాయిల్లో ఒకతెగా కనబడుతుంది అంటున్నాడు. మరి కాజోల్ కెరీర్ ఇక్కడితో ముగిసిపోయినట్లేనా? అంటే

ఆ నిర్ణయం రాజు (అజయ్ ముద్దు పేరు), కాజోల్‌లకే వదిలేశాను. అది వారి జీవితం. అందులో నేను కల్పించుకోను. ఆమె మళ్లీ నటించినా సంతోషమే, నటించకపోయినా సంతోషమే!  అంటాడు. అంటే కాజోల్ సంగతి మళ్లీ తెర మీద కనిపించేదాకా ఇంతేనా?



"అయితే..." అడిగాడు రంగన్న.

"అయితే ఏముంది. నీలాంటి రౌడీ ఆసరావుంటే వాళ్ల పీడ వుండదని" దు:ఖం, అవమానం, కోపం, నిస్సహాయత పట్టలేక ఏడ్చేసింది. రంగన్న బంగారు భుజం తట్టి, "ఫరవాలేదు, నేనున్నాలే ఇక" అన్నాడు. అనుకోకుండా బంగారు కొత్త ఉద్రేకంలో బొట్టుకుపోయింది. రంగన్నను పట్టుకుని వాస్తవమైన కృతజ్ఞతతో "నీదెంత పెద్దగుండె"అంది. నిజమే రౌడీ రంగన్న విశాలహృదయుడే. పెద్ద నాపరాయంతవున్న అతని ఛాతీమీద ఆపత్తులోవున్న ఆడవాళ్లు కనీసం ఆరుగురైనా ఆదమరిచి నిద్రపోవచ్చు! ఆ సాయంత్రం రంగన్న పట్టెడు పసుపుకుంకం, నూలుదారాలు తీసుకొచ్చాడు. బంగారు ముఖాన చిటికెడు కుంకుమ పెట్టాడు. నూలుదారాలు చూచి బంగారు "ఎందుకివన్నీ, దారాలతో నన్ను కట్టేసుకోలేవు" అంది. తెల్లారి లేచేసరికి బంగారు తన మెళ్లో పచ్చత్రాడు చూసుకుని నవ్వుకుంది. ఆ విధంగా బంగారుకు పూర్వ సువాసినీత్వం పోయి నిత్య సౌభాగ్యం లభించింది.

"నేనీ దౌర్జన్యపుకూడు, దొంగకూడు తినలేను. చేతయితే సరిగ్గా సంపాయించు. లేదూ, నువు కూర్చో. నేను పనిచేస్తాను" అని బెదిరించింది బంగారు. రంగన్న కాదనలేక తన పూర్వపువృత్తులన్నీ విడిచి పళ్లదుకాణమొకటి తెరిచాడు. ఏదో మాటల్లో బంగారు అడిగితే రంగన్న తనకు భార్యాబిడ్డలంటూ ఎవరూ లేరని చెప్పాడు. నిజమేననుకుంది బంగారు. కాని యీరోజుకు యింకో అభాగ్యురాలి "సౌభాగ్యం" తన పాలైందని తెలుసుకుని రిచ్చపోయింది. ఈ స్థితిలో తన ధర్మము, కర్తవ్యము ఏమిటో బోధపడలేదు. కళ్లు కొంగు నొత్తుకుని లేచింది. నెమ్మదిగ పొయ్యిదగ్గర కెళ్లి చితుకులు సరిచేసి రాత్రికి అంతమందికి అన్నం వార్చింది. ఇంతలో పార్వతి లేచింది.

"అదేమిటమ్మాయి ఇపుడన్నం వండుతున్నావ్. కళ్లన్నీ వాచాయే ఏడ్చావా, ఎందుకూ" అంది పార్వతి.

"నువు నిద్రపోతున్నావప్పా! మా పుట్టింటి దగ్గరనుంచి కబురొచ్చింది. నాకంటె పెద్దదొకతె వుందిలే! మా బావ వదిలేసి చాలా రోజులయింది. ఇవాళ ఆయన వచ్చారట. అప్పను తీసికెళ్తారట. పోయిచూసొస్తా నువ్వేం అనుకోకపోతే. నేవచ్చేవరకు యిల్లు చూస్తుంటావా? త్వరగా వెళ్లాలె."

పార్వతికి నోటమాట రాలేదు. ఆ విపరీత సన్నివేశానికి ఘ్రాన్పడిపోయింది. ఏమంటానికి పాలుపోలేదు.

"మీ యింటాయనకి చెప్పి వెళ్లవా? ఎపుడొస్తావు తిరిగి? నువ్వు లేకుండా నేనెట్లా వుండనిక్కడ" అన్నది.

"ఫరవాలేదు. మా ఆయన మహామంచి మనిషి. నువ్వేం భయపడవద్దు. పిల్లలకింత పెట్టి నువ్వింత తిను. ఆయన్ని తినమని చెప్పు. నేను వచ్చేసరికి ఆలస్యమవ్వచ్చు. ఆయన ఆడిగితే నేను పుట్టింటికెళ్లానని, మీ సొమ్మంతా యింట్లోనే వుందని, వెదుకుతూ ఎక్కడికీ వెళ్లవద్దని చెప్పమన్నానని చెప్పు."

"నీ మాటలు నాకేం అర్థం కావటం లేదు" అన్నది పార్వతి.

"నీకెందుకు. అట్లాగని చెప్పు. ఆయనకు అర్థమవుతుందిలే" బంగారు చెంగునున్న తాళం చెవులు తీసి పార్వతికిచ్చి గబగబ వెళ్లిపోయింది శూన్యదృక్కులు పరుస్తూ. భయాందోళిత మనస్కయై పార్వతి ఆ పూరింట్లోనే వుండిపోయింది.

ప్రొద్దులాటారే వేళకు ఎవరో తలుపు తట్టి 'బంగారు' అన్నారు. పార్వతి తడికలతో అమర్చిన వంటింట్లోకి వెళ్లి నుంచుని "సీతా తలుపు తీసి రామ్మా" అంది. తలుపు తీసిన సీత "నాన్నా" అంటూ రంగన్నకేసి చూసింది. రంగన్న కాళ్లు తడబడ్డాయి. ఈ హటాత్సన్నివేశానికతడు తట్టుకోలేకపోయాడు. తెల్లబోయి లోపలికి వచ్చాడు. "కృష్ణా నాన్నరా, నాన్న!" అంటూ సీత వంటింట్లోకి వెళ్లింది. కృ ష్ణుడు రంగన్నకేసి ఎరగనట్టు చూశాడు. రక్తస్పర్శ మహత్తరమయినది. రంగన్న ఒక క్షణంపాటు తన్ను తాను మర్చిపోయి ముమ్మూర్తులా తననే పోలివున్న పిల్లవాడిని ఎత్తుకుని ఎగరేసి ముద్దాడాడు. మళ్లీ తేరుకుని 'బంగారు' అని పిల్చాడు. పార్వతి తడిక అవతలనుంచి వచ్చి రంగన్నకేసి చూసింది.

"పా..ర్వ...తి" అన్నాడు రంగన్న తడి ఆరిన గొంతుతో!

పార్వతికి పరిస్థితి అంతా అర్థమైంది. ఆమె భయపడుతూ "నాకేం తెలియదు. ప్రొద్దున బస్సుస్టాండులో కనిపించి పిల్లాడిని ఎగాదిగా చూసి మమ్ములనింటికి పిలుచుక వచ్చింది. మధ్యాహ్నం పుట్టింటికి కెళ్తానని చెప్పి వెళ్లింది."

"ఆ, ఇంకేం చెప్పింది?"

"మీ సొమ్మంతా యింట్లోనే వుందని, వెదుకుతూ ఎక్కడికీ వెళ్లవద్దని చెప్పింది. అపుడర్థం కాలేదు నాకు" అంది పార్వతి.

రంగన్న తల బాదుకుంటూ "బంగారూ ఎంత పనిచేశావ్?" అన్నాడు. పార్వతి భయంగా వణికిపోయింది. "ఏదైనా అఘాయిత్యం చేస్తుందంటారా? నా రాత. నే పాదం పెట్టిన చోటల్లా యింతే. ఎంతమంచిది! ఏ అఘాయిత్యమైనా చేసిందంటే మరి నాకు పుట్టగతులుండవు. మీకు దణ్ణం పెడతాను. నేను వీళ్లను తీసుకుని నా దారిన పోతాను. మీరు వెళ్లి వెదకండి త్వరగా" అంది.

రంగన్న అచేతనావస్థలో ఉండి పార్వతికేమీ జవాబివ్వలేదు. పార్వతి కళ్లు తుడుచుకుని కొడుకునెత్తుకుని, కూతురుని వెంటపెట్టుకుని ఇల్లు విడిచింది. కాసేపటికి తెప్పరిల్లుకున్న రంగన్న "పార్వతీ!" అంటూ పరిగెత్తాడు. మర్రిచెట్టుకింద పార్వతిని ఆపి, "పద! వెనక్కి వెళ్లు! నేను బంగారును తీసుకువస్తా! జాగ్రత్త! ఇల్లు విడిచిపెట్టేవు ... నీవు వెళ్లి పోయావా, ఇక బంగారు నా ముఖం చూడదు! వెళ్లు. నిన్ను ఇదివరకెప్పుడూ బతిమాలినట్లు గుర్తు లేదు. నా మాట విని, ఇంటికెళ్లు!" అన్నాడు రంగన్న.

పార్వతి మౌనంగా ఇంటివేపు నడిచింది.

రంగన్న పరుగెత్తుకుంటూ బస్సుస్టాండుకెళ్లాడు. బంగారు కానీ ఏ బస్సు అయినా ఎక్కిందా అని కనిపించినవాళ్లల్లా అడిగాడు. ఎవరో ఒక కుర్రాడు "ఇందాక మాచారంవేపు నడుస్తుంటే చూశానండీ!" అన్నాడు. రంగన్న పరిగెత్తాడు రోడ్డువెంట. రాత్రయినా వెన్నెల రక్షించింది. పదకొండుగంటల వేళ బంగారు జాడ కానక నిస్సహాయంగా తిరిగి వస్తున్నాడు రంగన్న. దారిలో చర్చి గెటులోపల చెట్టుకింద ఏదో కదలిక పసిగట్టాడు. పరీక్షగా చూశాడు. లోపలికెళ్లాడు. చెట్టుకింద పచ్చికమీద అలసి నిద్రపోతోంది బంగారు. స్వేచ్ఛతో శరీరం బరువెక్కింది. ఆకలిగొన్నట్లు వెన్నెల నవితంగా తాగి మత్తెక్కి ఆకాశాన్ని చుక్కలను అదివరకెరగనట్లుగా అయోమయంగా చూస్తున్నది. బంగారు సౌందర్యం చూసి ముగ్ధుడైనాడు రంగన్న. బంగారు భుజాన్ని కదుపుతూ, "బంగారూ, లే!" అన్నాడు. బంగారు లేచింది. రంగన్నను చూసి తెల్లబోయింది.

"ఎందుకొచ్చావు నువ్వు?" అంది.

"నీ కోసం!" అన్నాడు రంగన్న. బంగారు రంగన్న చెయ్యి పట్టుకుని లేచింది. ఇద్దరూ ఇంటిదారి పట్టారు.

"చెప్పా పెట్టకుండా వెళ్లిపోయావు గదా! నెనెట్లా బతుకుతాననుకున్నావే! బంగారూ?"

బంగారు పలకలేదు. కాసేపటికి "రైలో, బస్సో ఎక్కటానికి డబ్బులు మరిచిపోయినాను. ఈ దారిపడి పోదామనుకున్నా. మధ్యాహ్నమంతా ఏడ్చి ఏడ్చి ఉన్నానేమో, వోపిక లేకపోయింది. ఆకలి. నీరసమొచ్చి ఆ గడ్డిమీద పడుకున్నా, తెల్లారి లేచి వెళ్లవచ్చని. లేకపోతే నీకూ దొరికేదాన్నేంటి?" అంది.

"నీవు మళ్లీ నాకు దొరికినందుకు విచారిస్తొన్నావా?"

బంగారు రంగన్నకేసి చురచురా చూసి, "నిన్ను బాగా కొట్టాలనిపిస్తోంది నాకు. కానీ ఓపిక లేదు!" అంది.

"బంగారూ! నీకేంటి తెలుసు? నా అదృష్టం మహా గొప్పది!" అన్నాడు రంగన్న.

ఇద్దరూ ఇల్లు చేరేసరికి పన్నెండయింది. పార్వతి తలుపు తెరిచింది. బంగారు పార్వతి చేతులు పట్టుకుని, "ఏ అప్పా! నన్ను ఎందుకు రమ్మన్నావు?" అంది. పార్వతి బంగారుకేసి ప్రేమగా చూస్తూ, "నన్నెందుకుండమన్నావే బంగారూ?" అంది. "అప్పా!" అంటూ పార్వతి భుజంమీద వాలింది బంగారు.

"లేచి, కాళ్లు కడుక్కోండి ఇద్దరూ! భోంచేద్దురుగానీ" అంది పార్వతి. బంగారుకు, రంగన్నకు వడ్డించింది పార్వతి.

ఆ మర్నాడు బంగారు లేచేసరికే రంగన్న దుకాణానికి వెళ్లిపోయాడు. బంగారు పొయ్యిముందుకెళ్లింది. పార్వతి వెనగ్గా వచ్చి, "లే, లే! నీకిక్కడేం పని? పువ్వులమ్మేదానివి పువ్వులాగుండు. వంటా వార్పూ నీకు దేనికి? నేనేమయ్యాను కనుక!" అంది.

బంగారు లేచి, "పోనీలే, అప్పా! నీ ముచ్చట నేనెందుక్కాదనాలి" అంటూ కొంటెగా నవ్వింది.

బంగారు నులకమంచంమీద పడుకుని కృష్ణుణ్ణి ముద్దులాడుతోంది. "మీ అయ్య ఎంత కర్కోటకుడురా, నువ్వు లేవని చెప్పటానికి నోరెట్లా వచ్చిందో!" అన్నది వాడి ఒళ్లు నిమురుతూ.

"బంగారూ! వాడితో ఆడుతుంటే నీకు పొద్దు తెలియదేంటి? అన్నం పట్టుకుపోయేదెప్పుడు?" అంది పార్వతి.

"ఇట్లా, ఇయ్యప్పా పట్టుకెళ్తాను. రారా, పోదాం!" అంది కృష్ణుణ్ణి లేవదీస్తూ బంగారు.

"వాడెందుకు, నీవెళ్లి ఇచ్చిరాక?" అంది పార్వతి.

"బాగుంది, చెట్టంత కొడుకునుంచుకుని మనకేంటీ పని? రేపటినుంచి ఆడి అయ్యకాడే అన్నం పట్టుకెళ్తాడు. రారా, ఇవాళ దారి చూపిస్తా!" అంది బంగారు.

కృష్ణుణ్ణి ఒక చంకనెత్తుకుని దుకాణంవేపు నడిచింది బంగారు.

సంతోషంతో పార్వతి కళ్లు చెమర్చాయి. ఆ దృశ్యం చూసి తన్మయురాలైన పార్వతి "బం...గా....రూ...!" అనుకుంది అస్పష్టంగా.

(అయిపోయింది) ■



MARKET PULSE 9738 TEL